క్లుప్తంగా

ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు

అల్వాల్: మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, పి. సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి ఈటలను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గోకుల్‌నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



గోకుల్‌నగర్ కాలనీ అధ్యక్షుడు మల్కయ్య

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ 2026 వరకు కొనసాగుతుంది. కాలనీ అధ్యక్షుడిగా టి.మల్కయ్య, ప్రధాన కార్యదర్శిగా శివరాం ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రాజు, కోశాధికారి శేఖర్‌రావు, ఉపాధ్యక్షులుగా రమణారెడ్డి, భిక్షపతి, సంయుక్త కార్యదర్శులుగా సునీల్, రాఘవేంద్రర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా విజయ్, వెంకటేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మల్కయ్య మాట్లాడుతూ కాలనీ సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్‌గా టీఆర్‌ఎస్‌కేవీ



మాట్లాడుతున్న బూరుగు మారుతీరావు

మల్లాపూర్: టీఆర్‌ఎస్‌కేవీ కార్మిక విభాగం భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ)గా మార్పు చెందిందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బూరుగు మారుతీరావు తెలిపారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు ఆదేశాల మేరకు సోమవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం కోకోకోలాలో వెజ్ అగ్రిమెంట్, నూతన కమిటీ, ఇతర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆశస్వామి, కల్యాణ్ చక్రవర్తి, ఆఫీస్ బేరర్స్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఉప్పల్: మతి స్థిమితం లేని యువతి అదృశ్యమైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన యాదగిరి కుమార్తె శ్రావణి(20) గత కొన్నాళ్లుగా మతి స్థిమితం కోల్పోయింది. ఈ నెల 18న ఇంటి నుంచి బయటికి వెళ్లిన శ్రావణి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం చుట్టు పక్కల వెతికినా ఫలితం లేక పోవడంతో సోమవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



గోడలపై పెయింటింగ్ వేస్తున్న సిబ్బంది

అల్వాల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త, వ్యర్థాలు పారవేస్తే జరిమానా విధిస్తామని అల్వాల్ పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా అల్వాల్ సర్కిల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వ్యర్థాలు పడవేస్తున్న బహిరంగ ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వాల్ పెయింటింగ్, నిత్యం ముగ్గులు వెయ్యడంతోపాటు నిరంతరం నిఘా పెడుతున్నారు. ఇంటి ముందుకు వచ్చే రిక్షాలోనే చెత్త వేయాలని సూచిస్తున్నారు.

వైద్యాధికారులకు అవార్డుల ప్రదానం



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

ఉప్పల్: ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ క్షయ నిర్మూలనలో ఉత్తమ పని తీరు కనబరిచిన అధికారులకు అవార్డులను అందజేశారు. సోమవారం ఉప్పల్ మేకల భారతి గార్డెన్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.వెంకట్‌కు జాయింట్ డైరెక్టర్ డా. రాజేషం, రీజినల్ డైరెక్టర్ అనురాధ అవార్డు అందజేశారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలు, క్షయవ్యాధి నిర్మూలనకు వెంకట్ చేసిన కృషికి గాను ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటి 'చింత'

- చెంగిచర్ల చింతల చెరువులోకి మురుగునీరు...
- అవుట్‌లెట్ లేక ముంపునకు గురవుతున్న కాలనీలు
- వర్షం పడితే కాలనీలు జలమయం
- సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నపం



చెరువులోకి వెళుతున్న మురుగునీరు



రోడ్డుపై నిలిచిన నీరు (ఫైల్)

బోడుప్పల్: చెంగిచర్ల చింతల చెరువు మురుగునీటి కాసారంగా మారుతుండటంతో పరిసర కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగువన ఉన్న కాలనీల నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు చింతల చెరువులోకి చేరుతుంది. అక్కడి నుంచి కిందికి వెళ్లేందుకు అవుట్ లెట్ లేకపోవడంతో చెరువులో నీటి మట్టం పెరిగి చుట్టు పక్కల కాలనీలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. అంతేగాక చెరువులో చేరిన మురుగునీరు అక్కడే దీర్ఘకాలికంగా నిల్వ ఉంటుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది కాలనీవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చెరువులోకి మురుగునీరు రాకుండా అడ్డుకట్టవేసి అనారోగ్యం నుంచి కాపాడాలని కాలనీవాసులు అధికారులు, పాలకవర్గాన్ని కోరుతున్నారు.

పదేళ్లలోనే భారీగా అభివృద్ధి

చెంగిచర్ల పరిధిలోని మూడు డివిజన్లు గడిచిన 10 ఏళ్లలో దినదినాభివృద్ధి చెందాయి. కొత్తగా పలు కాలనీలు ఏర్పడ్డాయి, అయితే కొత్తగా ఏర్పాటైన కాలనీల్లో అధికారులు, పాలకులు మౌలిక వసతులను కల్పించలేదు. కాలనీల్లో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీరు, వర్షపు నీరు దిగువకు పోయేందుకు అవుట్‌లెట్ లేదు. గతంలోని పాలకవర్గం, అధికారులు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగునీటిని తాత్కాలికంగా చింతల చెరువులోకి వదిలారు. దీంతో చెరువులో నీటి మట్టం పెరిగినప్పుడల్లా పక్కనే ఉన్న కాలనీల్లో డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌లోకి నీరు రివర్స్ అవుతూ కాలనీలను ముంచెత్తుతోంది.

ముంపు భయంలో కాలనీలు

చింతల చెరువును ఆనుకుని సాయినగర్, శ్రీనివాస్‌నగర్ ఫేస్ 1, 2, సుశీల టౌన్‌షిప్ ఉన్నాయి. చెరువుకు దిగువ భాగంలో హిమగిరి కాలనీ ఉంది. ఆయా కాలనీల్లో 200కు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. చిన్న వర్షాలకు సైతం కాలనీలు ముంపునకు గురవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భరించలేని దుర్వాసన

చెరువులోని మురుగునీటి కారణంగా పరిసర ప్రాంతాల్లో భరించరాని దుర్వాసన వస్తుంది. అంతేకాకుండా కొందరు చెరువులో వ్యర్థాలను తెచ్చి పడేస్తున్నారు. స్థానిక మత్స్యకారులు చెరువులో చేపలను పెంచుకుంటున్నారు. కాలుష్యం కారణంగా తరచూ చేపలు మృత్యువాత పడుతున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి



మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఎగువ ప్రాంత నుంచి వచ్చే మురుగునీటిని చెరువులోకి రాకుండా అడ్డుకట్ట వేయాలి. అవుట్ లెట్‌ను ఏర్పాటు చేసి మురుగునీటిని దిగువకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలి. అధికారులు, పాలకవర్గం చొరవ తీసుకుని మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– నర్సింహారెడ్డి, సాయినగర్ కాలనీ అధ్యక్షులు

నిత్యం నరకాన్ని చూస్తున్నాం



చింతల చెరువులోని మురుగునీటి కారణంగా నిత్యం నరకాన్ని చూస్తున్నాం. చెరువు నుంచి వెలువడే దుర్వాసన కారణంగా కాలనీల ప్రజలు తరుచూ అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు, పాలకవర్గం చొరవ తీసుకుని చెరువులోకి మురుగునీరు రాకుండా చేసి, చెరువును శుద్ధి చేయాలని కోరుతున్నాం.

– పీవీ రమణ మూర్తి, కాలనీవాసి

కమనీయం కాశీ విశ్వనాథుడి కల్యాణం



కాశీ విశ్వనాథస్వామి కల్యాణోత్సవ దృశ్యాలు

కాప్రా: ఎల్లారెడ్డిగూడ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో కొలువైన శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. మైసూరు దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు, చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరణ్‌శర్మ గురూజీ నేతృత్వంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం వరసిద్ధి గణపతి పూజతో వార్షిక కల్యాణోత్సం ప్రారంభించి ఆంజనేయస్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారిని మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపుగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి సతీసమేతంగా పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఎల్‌ఆర్ ట్రస్ట్ ప్రతినిధి భైరి నవీన్‌గౌడ్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మల్లాపూర్‌లో ఎన్వీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లో నడిచే సిట్ విచారణపై తమకు నమ్మకం లేదన్నారు. మియాపూర్ భూముల కుంభకోణం, ఇంటర్మీడియట్ మూల్యాంకనం, డ్రగ్స్ కేసుల్లో సిట్ ఎలాంటి పురోగతి సాధించలేదన్నారు. ప్రతి కేసులోనూ కల్వకుంట్ల కుటుంబ భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో హబ్సిగూడ కార్పొరేటర్ చేతన హరీష్, రామంతాపూర్ కార్పొరేటర్ శ్రీవాణి, బీజేపీ నేతలు బాలచందర్, రవినాయక్, మునుగంటి రాంప్రదీప్, గోపాల్‌గౌడ్, కృష్ణ, మహంకాళి, బాలకృష్ణ, నాదం, శిల్పారెడ్డి, అపర్ణ, సతీష్, ప్రకాష్, అనిత, దేవేందర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



షఫీనగర్‌లో పర్యటిస్తున్న నందికంటి శ్రీధర్

మౌలాలి: కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. జోడో యాత్రలో భాగంగా సోమవారం ఆయన మౌలాలి డివిజన్ షఫీనగర్‌లో కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే గ్యాస్ ధరలు తక్కువగా ఉండేవన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ ధర రూ.500లకు తగ్గిస్తామన్నారు. ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు, ఒక్క ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీస పెన్షన్ రూ.5000 ఇస్తామని, రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామన్నారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ పూర్తిగా విఫలమైందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే చూస్తున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్‌యాదవ్, వంశీ ముదిరాజ్, ఉమామహేశ్వరియాదవ్, వినోద్‌యాదవ్, హమీద్, సత్తన్న, రవి, భాగ్యరాణి, ఆశాయాదవ్, పద్మ, మజీద్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

హబ్సిగూడ: శ్రీ విఘ్నేశ్వర పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 30న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. అదే విధంగా ఈ నెల 25న సాయి గణేష్ హై స్కూల్ వార్షికోత్సవానికి రావాలని స్కూల్ యాజమాన్యం ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు భద్రయ్య, నర్సింహగౌడ్, కర్నె కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు మేకల ముత్యంరెడ్డి, పిట్టల నరేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

రామంతాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన రామంతాపూర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



హనుమాన్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మౌలాలి డివిజన్ హనుమాన్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం ఆమె అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో శ్మశానం నుంచి కృష్ణానగర్ బాక్స్ డ్రైన్ వరకు నూతన బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. డ్రైనేజీ సమస్య కారణంగా కాలనీవాసుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హిందూ శ్మశావాటికను అభివృద్ధి చేయడమే కాకుండా ఓపెన్ నాలను బాక్స్ డ్రైన్‌గా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో ఏఈ దీపక్, కాలనీవాసులు ఓం ప్రకాష్, తివారీ, ఉపేందర్, శశికళ, స్వాతి, లక్ష్మమ్మ, లక్ష్మమ్మ, లలిత, నాయకులు పర్వేష్, శివగౌడ్ నటరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: అనారోగ్యానికి గురై పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. హబ్సిగూడ డివిజన్‌లోని వెంకట్‌రెడ్డినగర్, గాంధీ గిరిజన బస్తీల్లో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గరిక సుధాకర్, డాక్టర్ బీవీ చారి, మేకల ముత్యంరెడ్డి, కనకయ్య, శివ, శ్రీధర్, లింగానాయక్, రవినాయక్, నరేందర్‌నాయక్, వెంకటసాయి, కృష్ణ, యాదమ్మ, ధనలక్ష్మీ, రాజ్యలక్ష్మీ, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

22న ఉగాది వేడుకలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శోభాకృత్‌నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాకులు తెలిపారు. 22న ఉగాది సందర్భంగా శిల్పారామానికి వచ్చిన ప్రేక్షకులందరికీ ఉగాది పచ్చడి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం సోమనాథ శాస్త్రిచే పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. అనంతరం రేణుక ప్రభాకర్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని శిల్పారామం ప్రత్యేకాధికారి కిషన్‌రావు తెలిపారు.

బాలాజీ ఆలయ హుండీ లెక్కింపు



అల్వాల్: దేవుడి అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రూ.1,57, 439 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచార్, భక్తులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి



తల్లిదండ్రులతో విద్యార్థులు

రామంతాపూర్: శ్రీచైతన్య స్కూల్‌లో సోమవారం మాతా పిత వందనం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు పాదపూజ చేసి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఏజీఎం సతీష్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు దైవంతో సమానమని పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, డీన్ సనమ్, నాగరాజు, కీర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బాధితుల దీక్ష భగ్నం



దీక్షను విరమిస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను సోమవారం తెల్లవారు జామున మేడిపల్లి పోలీసులు భగ్నం చేశారు. దీక్షలో కూర్చున్న కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షులు గోనె శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం జేఏసీ ప్రతినిధుల కోరిక మేరకు బోడుప్పల్‌లోని స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. సోమవారం ఉదయం దీక్షలో కూర్చున్న వారికి నాయకులు పోగుల నర్సింహారెడ్డి, కొత్త కిశోర్‌గౌడ్, కూరపాటి విజయకుమార్ ఓఆర్‌ఎస్ తాగించి దీక్షను విరమింప చేశారు.

కాలనీ సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న చక్రిపురం కాలనీవాసులు

కుషాయిగూడ: చక్రిపురం కాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సంక్షేమసంఘం ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మొగిలి రాఘవరెడ్డి, బుచ్చిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కొండారెడ్డి, నరసింహారెడ్డి, ముత్యంరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి చర్యలు తీసుకోండి

మల్లాపూర్: నాచారం డివిజన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎర్రకుంట శ్మశాన వాటికను వైకుంఠధామంగా తీర్చిదిద్దాలని, పటేల్‌కుంట చెరువు సుందరీకరణ, రైతు బజార్‌లో మల్టీ లెవల్ ఫంక్షన్‌హాల్ నిర్మించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

డ్రైనేజీ పనుల్లో అవకతవకలపై విజిలెన్స్ తనిఖీలు



కాలనీలో పర్యటిస్తున్న విజిలెన్స్ అధికారులు

మౌలాలి: మౌలాలి డివిజన్ కృష్ణానగర్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనుల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందడంతో జలమండలి విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి ఆధ్వర్యంలో ఫీల్డ్ ఆఫీసర్ వీరభద్రం సోమవారం కాలనీలో పర్యటించి ప్రజలను, కాంట్రాక్టర్లను విచారించారు. రూ.8 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా మ్యాన్‌హోల్ కనెక్షన్‌లో కలపడానికి కాలనీవాసుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయన్నారు. జలమండలి ఎండీ దానకిషోర్, ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా అవకతవకలకు పాల్పడిన అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ కనెక్షన్లు కలిగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ మేనేజర్ శ్రీనివాస్, విజిలెన్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నారు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అల్వాల్: నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర పభుత్వం చెలగాటమాడుతోందని బీజేపీ నాయకులు అన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ ఘటనను నిరసిస్తూ సోమవారం అల్వాల్‌లోని జేఏసీ శిబిరం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యోగాల కోసం లక్షలాది మంది యువకులు వేచి చూస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా పరీక్ష పేపర్లు లీకేజీ కావడంతో అనర్హులు ఉద్యోగాల్లో చేరే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సంఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, సునీత యాదవ్, మల్కాజిగిరి నియోజకవర్గ కన్వీనర్ సదానంద్‌గౌడ్, జిల్లెల రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తీసుకెళ్లండి

కుషాయిగూడ: కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 23 గుర్తు తెలియని వాహనాలు ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాహనదారులు వాటికి సంబంధించిన పత్రాలను చూపి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లను తెలియపరిచారు. ఇతర వివరాల కోసం 040–27853535, 9490617312 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.